www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 9 మే 2025 | 5 | కాకినాడ

కాలుష్యంపై అధికారుల బృందం విచారణ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తూర్పుపాకల గ్రామంలో కోళ్ల ఫారం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు చేసిన ఫిర్యాదుపై గురువారం పంచాయతీరాజ్, పరిశ్రమల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బృందం విచారణ చేపట్టింది. గ్రామంలో ఉన్న కోళ్ల ఫారాన్ని, పరిసరాలను పరిశీలించింది. స్థానిక ప్రజలను కలుసుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డి.శ్రీలలిత మాట్లాడుతూ కాలుష్యంపై చేపట్టిన విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పర్యటనలో పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్, డాక్టర్ చంద్రకిరణ్, ఇఒపిఆర్‌డి త్సలికి దొరబాబు, పంచాయతీ కార్యదర్శి బషీర్ పాల్గొన్నారు.

గ్రాసానికి గడ్డు కాలం

- సాగులో పెరిగిన యాంత్రీకరణ
- మూగ జీవాలకు అందని పశుగ్రాసం
- ఇబ్బందుల్లో పాడి రైతులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వరి సాగులో యాంత్రీకరణ విపరీతంగా పెరిగిపోయింది. యంత్రాలు లేనిదే రైతులు ఏ పని చేయని పరిస్థితి ఏర్పడుతున్న కారణంగా ఎండు గడ్డికి తీవ్ర కొరత ఏర్పడుతుంది. దీంతో పాడి రైతులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇదే తరుణంలో గ్రాసం పూర్తిస్థాయిలో లేక పశువులు అల్లాడుతున్న దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పశు సంపద క్రమంగా తగ్గిపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా 80 శాతం మందికి పైగా ప్రజలు ప్యాకెట్ పాలు కొనుగోలు చేసుకుంటున్నారు. మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా పశు పోషణ తగ్గిందని గణాంకాలు తెలుపుతున్నాయి. పశు సంవర్ధక శాఖ లెక్కల ప్రకారం కాకినాడ జిల్లాలో 76, 502 ఆవులు, 2,82,273 గేదెలు, 1,01,870 గొర్రెలు, 1,41,229 మేకలు ఉన్నాయి.

రోజుకి 2 వేల మెట్రిక్ టన్నులు

జిల్లాలో ఉన్న ఆవులు, గేదెలు వంటి పశు సంపదకు రోజుకి దాదాపు 2 వేల మెట్రిక్ టన్నుల ఎండుగడ్డి అవసరం ఉంటుందని పశు సంవర్ధక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు తగిన గ్రాసం అందుబాటులో లేక పశువులు విలవిలాడుతున్నాయి. పాడి రైతులు కూడా పశు పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే గ్రాసం కొరత లేకుండా గతంలో సర్కారు పథకాలు విరివిగా అందేవి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. దీనిని అధిగమించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయడం లేదు. ఫలితంగా పాడి పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

యంత్రాలతో కోతలు

యంత్రాలతో మాసూళ్ల వల్ల నాణ్యమైన ఎండు గడ్డి లభించక రైతులు నానా ఇక్కట్లు పడుతున్నారు. తరచూ వాతావ రణంలో వస్తున్న మార్పులు వలన రైతులు యంత్రాలను ఆశ్రయించక తప్పడం లేదు. మరోవైపు పంట పొలాలను రొయ్యల, చేపల చెరువులుగా మార్చేస్తున్నారు. ఈ కారణంగా కూడా పశుగ్రాసం కొరత తీవ్రంగా వేధిస్తోంది. మరోవైపు ఎండా కాలం వచ్చిందంటే పచ్చి గడ్డి మచ్చుకైనా కనిపించదు. వేసవిలో పశుపోషణ అంతా ఎండుగడ్డిపైనే ఆధార పడుతుంది. సార్వా సీజన్ లో గడ్డి తడిసిపోవడంతో పశువుల గ్రాసానికి పెద్దగా వినియోగించడం లేదు. పాడి పశువులకు గ్రాసం కోసం రైతులు ఎక్కువగా రబీ సీజన్లో వచ్చే గడ్డినే ఎక్కువగా వినియోగి స్తుంటారు. గతంలో ఎండు వరి గడ్డికి లోటు ఉండేది కాదు. కొన్నేళ్లుగా వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో ఎండు గడ్డి కొరత తీవ్రంగా ఏర్పడింది. దీనితో మూగజీవాలకు పస్తులు తప్పడం లేదు. .

రూ.12 వేలు పైనే

కేవలం కూలీలతో కోసిన గడ్డికి మాత్రమే పశువుల పని చేయడంతో అది అతి తక్కువగా అందుబాటులో ఉండడంతో గడ్డి ధరలు భారీగా పెరిగాయి. ట్రాక్టర్ ఎండు గడ్డి ధర రూ.12 నుంచి రూ.14 వేల పలుకుతుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు నేరుగా పంట పొలాల్లోనే గడ్డిని కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీంతో స్థానికంగా గడ్డికి మంచి డిమాండ్ ఏర్పడింది. రైతుల పంట గట్టుకు రావడానికి కోత యంత్రానికి, ట్రాక్టర్తో కలిపి దాదాపు రూ.5 వేలు ఖర్చు అవుతుంది. ఈ పరిస్థితుల్లో పశువులకు గడ్డి కొరత ఏర్పడిందని పాడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా ఆదుకుంటుందని ఆశిస్తే నిరాశే మిగిలింది. గత ప్రభుత్వం అమలు చేసిన పశుగ్రాస పథకాలను పక్కన పెట్టేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యంత్రాలతో తప్పడం లేదు

ప్రస్తుతం ఉన్న పరిస్థితులు రీత్యా రైతులు వరి కోతలు పూర్తిగా యంత్రాలతోనే సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పశుగ్రాసం కొరత తీవ్రంగా వేధిస్తోంది. పాడి పరిశ్రమ నానాటికి దెబ్బతింటుంది. ప్రభుత్వం వెంటనే ఆదుకుని పశుగ్రాస పథకాలను అమలు చేస్తే బాగుంటుంది.

-చల్లా బత్తుల ధర్మరాజు, పాడి రైతు, సామర్లకోట

ప్రభుత్వం ఆదుకోవాలి

గతంలో ఊరూరా పశుగ్రాసం పథకం అమలు చేసేవారు. సబ్సిడీతో పచ్చి గడ్డిని పెంచుకోవడానికి అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం పాలకులు ఎటువంటి పథకాలు అమలు కావడం లేదు. ఎండు గడ్డి కొరత ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం పథకాలను కొనసాగిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

-చిన్నపాల మహేష్, పాడి రైతు, జగ్గమ్మగారి పేట, సామర్లకోట

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

కార్పొరేట్ లాభాల కోసమే లేబర్ కోడ్‌లు

-20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

-కేంద్ర కార్మిక సంఘాల నేతలు పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

కార్పొరేట్ శక్తుల లాభాల కోసమే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని కేంద్ర కార్మిక సంఘాల నేతలు మండిపడ్డారు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక టీచర్స్ హోమ్‌లో జిల్లా స్థాయి సదస్సు జరిగింది. తొలుత సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సిహెచ్.నరసింగరావు, జె.వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, ఎఐసిసిటియు రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ మాట్లాడుతూ బ్రిటిష్ వాడితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్రానికి ముందుగాని, తర్వాత గాని వచ్చిన కార్మిక చట్టాలు ఏవి కూడా ఒకరి దయతో వచ్చినవి కాదని, వేలాదిమంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న హక్కులని గుర్తు చేశారు. 3 నల్ల చట్టలతో రైతులను, 4 లేబర్ కోడ్లలో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలుపరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటుందని విమర్శించారు. ఇటువంటి కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొంటున్నారని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు అందరూ కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోడీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు ఎల్ఐసి సత్యనారాయణ, కాళ్ళ నాగేశ్వరరావు, షేక్ పద్మ, నక్కెళ్ళ శ్రీను, రొంగుల ఈశ్వరరావు, మేడిశెట్టి వెంకటరమణ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ, వేణి, వెంకటలక్ష్మీ, ఐఎఫ్‌టియు రాష్ట్ర కోశాధికారి గుబ్బల ఆదినారాయణ మూర్తి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాగుల రఘువులు, గరగ దుర్గారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు లచ్చారావు, తదితరులు పాల్గొన్నారు.

క్షుద్ర పూజల వదంతులు నమ్మొద్దు

ప్రజాశక్తి - పిఠాపురం

క్షుద్ర పూజలు వంటి వదంతులను ప్రజలు నమ్మవద్దని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని జగ్గయ్య చెరువు కాలనీలో శిశువును నూతిలోకి పడేసిన ప్రాంతాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలుసుకుని జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ క్షుద్ర పూజల నెపంతో చిన్నారిని నూతిలో పడవేయడం బాధాకరమన్నారు. నిత్యం సమాజంలో మూఢనమ్మకాల పేరున ఇలాంటివి ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయని, కొంత మంది క్షుద్ర పూజలు, చెడుపులు, చేతబడులు వంటి మూఢ నమ్మకాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. శిశువును నూతిలో పడేసిన సంఘటన వెనుక అనేక కారణాలు ఉంటాయని, అవన్నీ పోలీసుల దర్యాప్తులో బయటపడతాయన్నారు. ఇటువంఠి మూఢ నమ్మకాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. తక్షణమే ప్రభుత్వం మూఢనమ్మకాలువ్యతిరేక చట్టం తెచ్చి ప్రజలను విజ్ఞానవంతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలందరూ ధైర్యంగా ఉండాలని, ఇలాంటి మూఢనమ్మకాలను నమ్మొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో కరణం విశ్వనాధం, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెద్దాపురం

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సిఐటియు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సార్వత్రిక సమ్మెపై ప్రచురించిన బుక్ లెట్ ను కార్మిక సంఘ నేతలు ఆవిష్కరించారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గం అనేగా సమస్యలతో సతమతమవుతుందన్నారు. వేతనాలు పెరగక కార్మిక కుటుంబాలు అవస్థలు పడుతున్నాయన్నారు. కార్మికులను ఆదుకోవలసిన పాలకవర్గాలు వారి హక్కులను హరిస్తున్నాయని అన్నారు. కార్మిక హక్కుల కోసం ఈనెల 20న తలపెట్టిన ఈ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు సిఐటియు ఆధ్వర్యంలోని కార్మిక సంఘాలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు దాడి బేబీ, మాగాపు నాగు, గూనూరు వెంకటరమణ, తాడిశెట్టి గంగ, డి. క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ జె.వెంకట్రావు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం డిఆర్ఒ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని, ఈ పరీక్షలకు మొత్తం 21,541 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో 15,933 మంది మొదటి సంవత్సర పరీక్షకు, 5,608 మంది రెండవ సంవత్సర పరీక్షలకు హాజరౌతారన్నారు. జిల్లాలో మొత్తం 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొదటి సంవత్సర పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, రెండవ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ సిసి కెమేరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. ఇంటర్మీడియేట్ విద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా పత్రాలు, సామాగ్రి ఉంచిన స్ట్రాంగ్ రూమ్, మెటీరియల్ పంపిణీ, తిరిగి సేకరణ చేసే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు. పరీక్షల తేదీలలో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయాలని, వాటి సమీపంలోని జెరాక్స్ కేంద్రాలను పరీక్షల సమయంలో మూసివేయించాలని తహశీల్దార్లను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేందుకు తగిన బస్సు సర్వీసులు నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. పరీక్షల సమయంలో అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఐ.శారద, డిపిఒ వి.రవికుమార్, జిల్లా పరీక్షా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న డిఆర్ఒ వెంకట్రావు

ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర నాగేశ్వరరావు, కోనాల వెంకటరమణ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మి కులుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమకు ఉద్యోగ భద్రత లేదని, వేతనాలు పెంచడం లేదని, అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వివిధ రూపాల్లో అభ్యర్థనలు, నిరసనలు తెలిపినా ప్రభుత్వం స్పందించనందున నిరవధిక సమ్మె చేపట్టామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి ఇనుమర్తి శ్రీనివాస అయ్యప్పస్వామి, సంఘ కమిటీ సభ్యులు సుంకర సత్తిరాజు, నామా సూర్యప్రకాశరావు, పూల ప్రశాంత్, మహపాతిన పాపారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పిఠాపురం

నూతన పాలకవర్గం సభ్యులు

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం రాపర్తి రోడ్డులోని సంఘ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో సంఘ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా డేగల సత్యనారాయణ, అధ్యక్ష, కార్యదర్శులుగా పప్పుల వీరబాబు, ఒమ్మి గోవిందు, ఉపాధ్యక్షుడిగా వి.బాబ్జి, సహాయ కార్యదర్శిగా గోపాలపు సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాయుడు సత్యనారాయణ, సహాయ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గాది కోటేశ్వరరావు, ట్రెజరర్‌గా దంట్ల గోపాలకృష్ణ, సహాయ ట్రెజరర్‌గా వనము శ్రీను, కమిటీ సభ్యులుగా ఎం.సత్యనారాయణ, కె.పెద్దకాపు, జి.శ్రీను, బి.లచ్చ, ఎస్.శివ, జి.లోవరాజు, ఎ.చక్రకుమార్, ఎస్.శ్రీను, వి.కనకారావు, ఎ.శ్రీను, పి.కృప ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న క్లైములు విడుదల చేయాలన్నారు. ప్రతి ఒక్క కార్మికుడికి సంఘం తరపున అండగా ఉంటామన్నారు.

వ్యవసాయాన్ని లాభదాయకం చేసేందుకు కృషి

ప్రజాశక్తి - కరప

వ్యవసాయాన్ని లాభదాయకం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. గురువారం మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. కొత్తగా మంజూరైన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక హైస్కూల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 37 మంది రైతులకు దమ్ము ట్రాక్టర్స్, డ్రోన్లు, దమ్ము బ్లేడ్స్, బ్యాటరీ స్ప్రేయర్స్ 50 శాతం రాయితీపై అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి, కాపు, ఇడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ద్వారా 319 యూనిట్స్‌కు రూ.8.15 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో రూ.28.79 కోట్లతో నియోజకవర్గంలో 270 పనులు చేపట్టామన్నారు. మరో రూ.13 కోట్లు విలువ చేసే పనులకు ప్రతిపాదనను సిద్ధం చేయడం జరిగిందన్నారు. త్వరలోనే మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, నున్న గణేష్‌నాయుడు, ముద్రగడ రమేష్, యాళ్ళ పండు, బండారు, మురళి, నీటి సంఘం అధ్యక్షులు పుణ్యమంతుల సత్యనారాయణ, ఎంపిడిఒ ఎం.అనుపమ, తాహశీల్దార్ పి.సత్యనారాయణ, ఎడిఎ బాబురావు, ఎఒ రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యంత్ర పరికరాల పంపిణీని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నానాజీ

కార్టూ'నిజం'



రెడ్‌క్రాస్ పురస్కారాన్ని అందుకున్న కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, అంతర్జాతీయ తలసేమియా దినోత్సవాన్ని పురష్కరించుకుని గురువారం విజయవాడలోని రాజభవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి రెడ్‌క్రాస్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 రక్త దాన కేంద్రాలు నడుస్తున్నాయని, అందులో ప్రతి సంవత్సరం 65 వేల రక్త యూనిట్లు పైగా సేకరించడం జరుగుతుందన్నారు. ఇందులో నుంచి అవసరం ఉన్న ప్రజలకు లక్షకు పైగా యూనిట్ల రక్తం ఇవ్వడం జరుగుతుందని, అందులో మూడవ వంతు యూనిట్లు ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందే పేద రోగులకు ఉచితంగా సరఫరా చేస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ రెడ్ క్రాస్ ద్వారా విశిష్ట సేవలు అందించిన కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి బంగారు పతకం, పురస్కారాన్ని అందజేసి అభినందించారు. జిల్లాలో రెడ్ క్రాస్ సేవలు విస్తృతంగా అందించుటకు నిరంతరం రెడ్ క్రాస్ జిల్లా కమిటికి దిశా నిర్దేశాలు చేస్తూ ముందుకు నడపడం విశేషమని, కలెక్టర్ షాన్‌మోహన్ అందుకున్న ఈ అవార్డు, జిల్లాకే గర్వకారణమని, రాష్ట్రవ్యాప్తంగా మానవతా సేవా కార్యక్రమాల బలోపేతానికి కృషి చేస్తున్న వారికి ఈ అవార్డు విశిష్ట గుర్తింపుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రథమ మహిళ సమీరా నజీర్, గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం.హరి జవహర్లాల్, ఐఆర్‌సిఎస్ ఛైర్మన్ వైడి.రామారావు, రెడ్ క్రాస్ ఆంధ్ర ప్రదేశ్ శాఖ సిఇఒ, ప్రధాన కార్యదర్శి ఎకె.ఫరీదా, రాజభవన్ సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కారాన్ని అందుకుంటున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఎస్ఎస్ గ్రాండ్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ, కుడా ఛైర్మన్

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు. గురువారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్-ఎస్ గ్రాండ్ ఇన్' అతిథి గృహ సముదాయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో యువత స్వయం ఉపాధిని సాధించాలని అన్నారు. ఇలా స్వయం ఉపాధిని పొంది మరి కొందరికి ఉపాధి అవకాశన్ని కల్పించిన యజమాని అశోక్ కృషిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కూటమి నాయకులు బిక్కిన విశ్వేశ్వరరావు, డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీశ్ మోహన్, గోలి దొరబాబు, సరోజ వాసు, పిట్టా జానకిరామారావు, పెంకే వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కుట్టు్, శిక్షణలో ఎంఎల్ఎ సత్యప్రభ

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం మండలంలోని పెద్దపాలెంలో రూ.35 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఆమె ప్రారంభించారు. రూ.14 లక్షల విలువ చేసే యంత్ర పరికరాలను రైతులకు రాయితీపై అందజేశారు. అలాగే ప్రత్తిపాడులో మహిళ సాధికారిత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో కొన్ని సంవత్సరాల నుంచి అభివృద్ధి జరగక ఎన్నో సమస్యలు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.కుమార్‌బాబు, టిడిపి నాయకులు యాళ్ల జగదీష్, అమరాది వెంకట్రావు, చీకట్ల నాని, ఎఒ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఎర్రవరంలోని సీతారామ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, టిడిపి నాయకులు బసా ప్రసాద్, మైరాల కనకారావు, కూటమి నాయకులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చిన్నారి మృతి ఘటనపై దర్యాప్తు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో కలకలం రేపిన ఐదు నెలల పసికందు మృతి ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందని సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదు నెలల పసికందు అయిన తన మనవరాలు కనిపించడం లేదని పాప తాత దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదుపై సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించడం జరిగిందన్నారు. ఎఎస్‌పి మనీష్ దేవరాజ్‌పాటిల్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారన్నారు. నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపడుతున్నామని, సాంకేతికతను ఉపయోగించి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ని రంగంలోకి దించి పలు ఆధారాలు సేకరించడం జరిగిందన్నారు. అక్కడ క్షుద్ర పూజలు జరిగినట్టుగా చెప్పబడుతున్న దానిలో వాస్తవం లేదని, కేవలం జరిగినటువంటి సంఘటనను కప్పిపుచ్చేందుకు క్షుద్ర పూజలు సీన్ క్రియేట్ చేసినట్టుగా తమ దర్యాప్తులో ప్రాథమికంగా తేలిందన్నారు. పాప మృతిని హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. త్వరలోనే అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

గోదావరిలో దూకిన యువకుని గల్లంతు

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి దూకి యువకుడు గల్లంతయిన సంఘటన గురువారం ఉదయం జరిగింది. అమలాపురం మండలం కామనగరువుకు చెందిన కామన భార్గవ్ గా (21)గుర్తించారు. గల్లంతయినాడు భార్గవను రక్షిరేందుకు గోదావరిలోకి దూకిన అన్న రాజేష్ ప్రమాదంలో చిక్కుకున్నాడు. బ్రిడ్జి పైనుంచి లారీ డ్రైవర్ పగ్గము అందించడం తో స్థానిక మత్స్యకారులు రాజేష్‌ను కాపాడి ఒడ్డుకు చేర్చారు. బైకుపై అన్నదమ్ములిద్దరూ వచ్చారని సానికులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తిరుగుడు మెట్ట గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంలపై పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాడుతున్న పది మందిని అరెస్టు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.7,130 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చెందుర్తిలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి ఎస్‌సి పేటలో గురువారం అగ్ని పమాదం చోటుచేసుకుంది . ఈ ప్రమాదంలో అయినవిల్లి నానికి చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. సమయానికి ఫైర్ సిబ్బంది రాకపోవడంతో స్థానికులు మంటలను అదుపు చేశారు. ఇంటిలో అన్నీ సామాన్లు దగ్ధం అయ్యాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - మండపేట

ఈనెల20న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం మండపేట కొత్త బస్టాండ్ వద్ద ఐఎఫ్టియు ఆధ్వర్యంలో రైస్ మిల్లు జట్టు కార్మికులతో సార్వత్రిక సమ్మె కు సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 20 న జరిగే కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు తెలిపారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాద. బడా కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందన్నారు. కార్మికుల శ్రమతో అభివృద్ధి చెందిన ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వేలు, విమానాశ్రయాలు, రోడ్లు, ఎల్ఐసి, బొగ్గు గనులు, ఓడరేవులు వంటి వాటిని బడా కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు అమ్మేస్తున్నారని, పరిశ్రమ తమ పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోకుండా కార్మిక చట్టాలు ఆటంకంగా ఉన్నాయంటూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లు గా విభజించి అమలు చేయడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. కార్మిక సమస్యలపై దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతులు సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్టియు నాయకులు చింత రాజారెడ్డి, గంధం శ్రీను, చల్లా శ్రీను, మేడపాటి సత్తిబాబు, వినకోటి సత్యనారాయణ, కంబాల సత్తిబాబు తదితరులు రైస్ మిల్లు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న తహశీల్దార్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారిని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాధులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం శ్రీ వెంకటేశ్వర సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు మూడో సెమిస్టర్ ఫలితాలలో ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ కె.మనోహర్ తెలిపారు. ఎస్ రమ్య శైలు 9.6 గ్రేడ్ ఫలితాలలో కళాశాలలో టాపర్ గా నిలిచిందన్నారు. రామిశెట్టి దేవి శ్రీ 9.3, కె.రేవతి, జె. స్వప్న 9.0 గ్రేడ్‌తో 3 వ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కెవిఆర్ఎస్.నరసింహారావు, ఎఒ కరాటం ప్రవీణ్, యాలంగి వరప్రసాద్ పాల్గొన్నారు.

కనులవిందుగా సత్యదేవుని కళ్యాణం

తరలొచ్చిన వేలాది మంది యాత్రికులు
ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు


సత్యదేవుని కళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పట్టు వస్త్రాలు, పెండ్లి సామగ్రిని తీసుకొస్తున్న చైర్మన్, ఇఒ దంపతులు తదితరులు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం రత్నగిరిపై సత్యనారాయణస్వామి కళ్యాణం గురువారం రాత్రి కనుల విందుగా సాగింది. కళ్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం 8 గంటలకు ప్రధానాలయం వద్ద సంప్రదాయ బద్ధంగా అంకురార్పణ చేసి సంకల్పం చేశారు. రాత్రి 7 గంటలకు కొండ దిగువ వధూవరులైన సత్యదేవుని వెండి గరుడవాహనం పైన, అనంతలక్ష్మి అమ్మవారిని పెద్దలైన క్షేత్రపాలకులు సీతారాముల సమక్షంలో వెండి రథంపై ఊరేగిస్తూ గ్రామోత్సవ సేవ నిర్వహించారు. అనంతరం వివిధ పరిమళ పుష్పాలతో, విద్యుత్ దీపాల అలంకరణతో తయారు చేసిన కళ్యాణవేదికపై స్వామి, అమ్మవారి విగ్రహాలను తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణస్వామి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం చైర్మన్ రాజా ఐవి. రోహిత్ దంపతులు, ఇఒ వీర్ల సుబ్బారావు దంపతులతో పాటు జిల్లా అధికారులు కళ్యాణ సామగ్రిని వేదికవద్దకు తీసుకొచ్చారు. రాత్రి 9.30 గంటలకు స్వామివారి కళ్యాణ ఘట్టానికి అర్చకస్వాములు శ్రీకారం చుట్టారు. పలు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి, అమ్మవార్ల కళ్యాణం జరిపించారు. నూతన వధూవరుల పాణిగ్రహణంతో కళ్యాణతంతు వైభవంగా ముగిసింది. తదుపరి స్వామివారి ప్రసాదం, కళ్యాణ తలంబ్రాలను ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆలయ సిబ్బంది భక్తులకు వితరణ చేశారు. కళ్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం ఇఒ సుబ్బారావు సూచనలతో అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. పెద్దాపురం డిఎస్‌పి హరినాథరాజు ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఆర్‌డిఒ శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న ఇన్‌ఛార్జ్ పదవి..!

-ఆశావహులు ఎదురుచూపులు


సూర్యకిరణ్

రాజాబాబు

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ పదవి నేతలను ఊరిస్తోంది. ఇటీవల ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకున్న వివాదంలో ఆ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న వరుపుల తమ్మయ్యబాబుపై ఆ పార్టీ అధిష్టానం క్రమశిక్షణా చర్యల్లో భాగంగా పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పదవి ఖాళీ అయింది. దీంతో జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటున్న పలువురు ఆశావహులు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం లో జనసేన పార్టీ మిత్రపక్షంగా వ్యవహరిస్తోంది. దీంతో ఇన్‌ఛార్జ్ పదవిపై ఆ పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకత్వం సైతం ఆశ పడుతోంది. నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకులు పలువురు ఆ పదవి కోసం తమ తమ ప్రయత్నాలు చేస్తున్నారు. కత్తిపూడికి చెందిన మేడిశెట్టి సూర్యకిరణ్ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన సేవలు అందిస్తున్నారు. తమ్మయ్యబాబు తరువాత ఆ స్థాయిలో గుర్తింపు పొందిన నేతగా సూర్యకిరణ్ ఉన్నారు. ఆయన పార్టీ అధినాయకత్వంతో సంప్రదింపులు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే మాజీ ఎంఎల్‌ఎ పర్వత చిట్టిబాబు సోదరుడు పర్వత రాజబాబు ఇన్‌ఛార్జ్ పదవి ఇస్తే జనసేనలో చేరేందుకు అంగీకరించినట్లు నియోజకవర్గంలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆయన శంఖవరం మండల పరిషత్ అధ్యక్షుడుగా వైసిపి నుంచి ఎన్నికయ్యారు. అయితే 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల నుంచి ఆయన వైసిపికి దూరంగా ఉంటున్నారు. గత ఎన్నికల్లో ప్రత్తిపాడు వైసిపి అభ్యర్థిగా మాజీ ఎంఎల్‌ఎ వరుపుల సుబ్బారావు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో భాగంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పదవి నుంచి ఆయనను తొలగించి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుమారుడు గిరిబాబును ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. దీంతో తమకు వైసిపిలో తగిన ప్రాధాన్యత లేదనే కారణంతో రాజాబాబు ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన చూపు జనసేన వైపు మళ్ళింది. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న రాజబాబుకు ఈ పదవి వరిస్తుందా? లేక పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న సూర్యకిరణ్‌ను పార్టీ గుర్తించి పదవిని కట్టబెడుతుందా? అనే చర్చ నియోజకవర్గంలో కొనసాగుతోంది.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎంఎల్‌ఎ

రక్తదానం చేస్తున్న జనసేన నాయకుడు కొండబాబు

ప్రజాశక్తి - కరప

తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం అధికార యంత్రాంగం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని ఎంఎల్‌ఎ పంతం నానాజీ ప్రారంభించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రక్తదానం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అనుపమ, తాహశీల్దార్ పి.సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, కార్యదర్శులు పి.వీరభద్రరావు, బ్రహ్మానందం, జనసేన నాయకులు చిన్నారి శీను, వాసంశెట్టి మహేష్, పేపకాయలు పవన్‌కుమార్, సురేంద్ర, నక్క బ్రహ్మాజీ, శాఖ వంశి,తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పేద మహిళలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ యూనిట్ హెడ్ శ్రీనివాస రావు, వెంకట దుర్గావతిల వివాహ దినోత్సవం పురస్కరించుకుని పేద మహిళలకు నూతన వస్త్రాలు, వృద్ధులకు భోజన ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి డిఎస్‌పి దొంగ రామసత్యనారాయణ, శ్రీదేవి, లక్ష్మీసృజన, అడబాల రత్నప్రసాద్, శిరీష, ఉంగరాల వెంకటేశ్వరరావు, ఓం నమశ్శివాయ, పాల్గొన్నారు.

పెహల్గాం ఉగ్రదాడిపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం పెహల్గామ్ ఉగ్రవాదుల దాడిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉగ్రవాదులు పర్యాటకులపై జరిపిన దాడికి సంబంధించి చర్చాగోష్టి నిర్వహించారు. ఈ శిబిరంలో కోటపాడు హైస్కూల్ హెచ్‌ఎం రాళ్లపల్లి వెంకటేశ్వర రావు, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవడం, కథలు చెప్పడంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు డిబేట్ నిర్వహించారు.

ఆపరేషన్ సిందూర్‌పై ప్రశంసలు

ప్రజాశక్తి - గండేపల్లి

పహల్గామ్ దాడికి ప్రతిగా భాతర సైనిక దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై టిడిపి యువ నాయకుడు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ప్రశంసలు కురిపించారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని వసంత్ తెలిపారు.

పాత్రికేయుల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

సాక్షి ఎడిటర్ కార్యాలయంపై దాడికి నిరసనగా నియోజకవర్గ పరిధిలోని పాత్రికేయులు గురువారం నల్ల బ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించి ఆర్‌డిఒ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు అడపా వెంకటరావు, రాకుర్తి రాంబాబు పాల్గొన్నారు. ప్రజా సంఘాల నాయకులు నీలపాల సూరిబాబు, దారపురెడ్డి క్రాంతి కుమార్ మద్దతు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో పెమ్మాడ వీరభద్ర, బిక్కిన వెంకట్, చవ్వాకుల ఈశ్వర్, ఉప్పలపాటి చంద్ర దాస్, జి.సుబ్రమణ్యం, గంగాధర్, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బీమా చేయించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో 70 సంవత్సరాల లోపు వయసు కలిగిన 15 వేల మంది ఉపాధి కూలీలకు బీమా చేయించాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటివరకు 4600 మందికి మాత్రమే బీమా పూర్తి చేశారన్నారు.ఉపాధి హామీ చట్టంలో మంజూరైన 84 పొలాల్లో ఇంకుడు గుంతలలో ఇప్పటివరకు 35 మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన వాటినివేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుధీర్, టెక్నికల్ అసిస్టెంట్లు దుర్గాప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వంద రోజుల పని కల్పనే లక్ష్యం

కూలీలతో మాట్లాడుతున్న ఎపిఒ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - కాజులూరు

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించడం లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని ఎపిఒ కెవి.వెంకటలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని నామవానిపాలెం, పల్లిపాలెం గ్రామాల్లో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని చేస్తానని ముందుకు వచ్చిన ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా పని కల్పించడం జరుగుతుందని తెలిపారు నిర్దేశించిన పనిని సకాలంలో పూర్తి చేసినట్లయితే ప్రతి ఉపాధి కూలీకి రూ.307 కూలిగా చెల్లించడం జరుగుతుందన్నారు. మండలంలో 26 గ్రామాల్లో ప్రతిరోజు 2500 మందికి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఉపాధి కూలీలు జీవన్ జ్యోతి, జీవన సురక్ష బీమా యోజనలో బీమా చేసుకుంటే ప్రమాదవశాత్తు మరణం సంబంధించినప్పుడు రూ.2 లక్షలు కూలీ కుటుంబానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా నిర్దేశించిన పనిని ఉదయం 6 గంటల నుంచి 11 గంటల లోపు పూర్తిచేసుకున్నట్లయితే ఎండ దెబ్బ తగలకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తిరుపతిరావు, ప్రసాద్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా తటవర్తి

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా తటవర్తి సత్యనారాయణ ఎంపికయ్యారు. గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సారా మురళీ శ్రీనివాస్, విజయ రాజ్‌కుమార్, కెవిఎస్.నాయుడు పర్యవేక్షణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె. వల్లిబాబు, ఉపాధ్యక్షులుగా ఎన్.దుర్గా ప్రసాద్, సహాయ కార్యదర్శిగా కందుల వెంకటాచలం, కోశాధికారిగా మడికి రాంబాబు, లైబ్రరీ సెక్రటరీగా కొండ్రు సతీష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పేరిశెట్టి బాలకృష్ణ, లేడీ రిప్రజెంటేటివ్‌గా శిలపరశెట్టి విశాలాక్షి, సూపర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా దేవులపల్లి సూర్య నారాయణమూర్తి, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఎవి.జనార్దన్, సకురు దుర్గారావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా జమ్మి వెంకటకృష్ణారావు, పలివెల చిన చంటి, వైయుఎస్ .గణేష్‌కుమార్, వివిఎస్. నారాయణమూర్తి, లేడీ ఎగ్జిక్యూటివ్‌గా కాపవరపు సూర్యప్రభ ఎంపికయ్యారు. నూతనంగా ఎంపికైన వారందరినీ పూలమాలలతో అభినందించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

మజ్జిగను పంపిణీ చేస్తున్న డాక్టర్ విఠల్

ప్రజాశక్తి - కాకినాడ

ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకుల కోసం శరణ్య ట్రస్ట్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవసేవగా భావించి ఆసుపత్రికి వచ్చే రోగులకు, సహాయకులకు మజ్జిగ వితరణ చేపట్టేందుకు ముందుకు వస్తున్న శరణ్య ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. ప్రతీ రోజు 3 వేల నుంచి 4 వేల మందికి సరిపడే మజ్జిగను ఉచితంగా పంపిణీ సాధారణ విషయం కాదన్నారు. వేసవి కాలంలో శీతల పానియాలు సేవించడం హానికరమని, సహజ సిద్ధమైన మజ్జిగ ద్వారా ఆరోగ్యం కాపాడుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఇఎన్‌టి ప్రొఫెసర్ డాక్టర్ జిఎస్ఎన్.మూర్తి, డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, డిసిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ వి.వరప్రసాద్, ఎఆర్ఎంఒ డాక్టర్ వై. లావణ్య, శరణ్య ట్రస్ట్ కన్వీనర్ వి.నూకరాజు, సెక్రటరీలు గాంధీ, లక్ష్మి పాల్గొన్నారు.

కుట్టు శిక్షణపై వైసిపి విమర్శలు దారుణం

ప్రజాశక్తి - సామర్లకోట

పేద మహిళలకు ఉపాధి కల్పన కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన కుట్టు శిక్షణపై వైసిపి చేస్తున్న విమర్శలు దారుణమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి అక్రమాలకు చిరునామాగా నిలిచిన వైసిపి నేతలు ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని అన్నారు. యువతతోపాటు, మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుట్టుశిక్షణను ఇస్తున్నట్లు తెలిపాఉ. వైసిపి నాయకుడు ఆవాల లక్ష్మీనారాయణ కుట్టు శిక్షణపై విమర్శలు చేయటం సిగ్గుచేటన్నారు. మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో చేపట్టిన కుట్టు శిక్షణ కార్యాక్రమంపై అసత్య ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు అందుగుల జార్జిచక్రవర్తి, గోర్తి సత్యనారాయణ, పడాల వీరబాబు, బాడీతమాని త్రిమూర్తులు, మల్లిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు

ప్రజాశక్తి - రౌతులపూడి

గ్రామాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా తరచూ విద్యుత్ కోతలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగుల చదువుకు విద్యుత్ కోతలు ఆటంకం కలిగిస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పలుదఫాలుగా విద్యుత్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్క వైపు ఎండలు మండుతూ ఉక్కపాతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితుల్లో విద్యుత్ కోతలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

తూర్పు కాపులకు ఒబిసి సర్టిఫికెట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఉభయగోదావరి జిల్లాలోని తూర్పు కాపులకు ఒబిసి సర్టిఫికెట్లు ఇవ్వాలని తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మూది నారాయణస్వామి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో తూర్పు కాపులకు ఒబిసి సర్టిఫికెట్లు ఇచ్చేవారని, అయితే గత ప్రభుత్వం వాటిని నిలిపివేసింది అన్నారు. దీంతో తూర్పు కాపు యువత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు, నీట్ వంటి పోటీ పరీక్షలకు రిజర్వేషన్లకు దూరం కావాల్సి వస్తుందని అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్విని దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

మహారాజశ్రీ 4వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 150/2021

Between:
Syndicate Bank, a body Corporate consituted under the Banking Companies (Acquisition and transfer of undertakings) Act, 1970 having its head office at Manipal, Karnataka State, Innispeta Branch, Rajamahendravaram, represented by its Chief Manager and GPA holder V.R.S.Sarma. ***...Plaintiff***

AND

Sri Miriyala Syam Prasad and Others ***...Defendants***

D-1: Sri Miriyala Syam Prasad, S/o. Appa Rao, Hindu, aged 36 years, A Block, Satellite City, Main Road, Rajamahendravaram ***...1st Defendant***

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 12-5-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి **జి.వి.రామలక్ష్మి**
02-5-2025 అడ్వకేట్స్, రాజమండ్రి

చిత్రలేఖనం, పెన్సిల్ ఆర్ట్‌పై శిక్షణ

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న చిన్నబాబు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు ఎఎంజి స్కూల్ డ్రాయింగ్ ఉపాధ్యాయులు ఎం.చిన్నబాబు చిత్రలేఖనం, పెన్సిల్ ఆర్ట్‌పై శిక్షణ ఇచ్చారు. సులువుగా నెంబర్ల ద్వారా డ్రాయింగ్ గీయించారు. డిఆర్‌డిఎ సిబ్బంది ఎం.సత్యబాల ఇంగ్లీష్ గ్రామర్‌పై శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయులు బి. సూర్యనారాయణ విద్యార్థులకు నీతి కథలు బోధించడం, కథలు చదివించడం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి కె.కిషోర్, గ్రంథాలయ సిబ్బంది ఎస్.రాజు, ఎవిఎస్.నాగేంద్రకుమార్, టి.వీర్రాజు, వి.అరుణ, కె.ప్రియదర్శిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ముంచుతున్న అకాల వర్షాలు

ఆరబెట్టిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - సామర్లకోట

రైతుల కష్టాన్ని అకాల వర్షాలు ముంచేత్తుతున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు రైతులకు గుండెల్లో దడ పుట్టిస్తుంది. గత 3 రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు పడుతూ కల్లాలపై ఉన్న దాన్యాన్ని తడిపి ముద్ద చేస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి ఎండ కాయడంతో బుధవారం కురిసిన వర్షానికి తడిచిన దాన్యాన్ని రైతులు పెద్ద ఎత్తున ఆరపోశారు. ఐతే మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి రెండు గంటలు నుంచి మబ్బులు ఏర్పడి వర్షం పడడంతో రైతులు వారి ధాన్యం రాసుల వైపు పరుగులు తీశారు. ధాన్యపు రాశులపై బరకాలు, గడ్డి వేసి రక్షణ చర్యలు చేపడుతున్నారు. తడిసిన దాన్యం ఏమాత్రం ఆరకుండానే మళ్ళీ మళ్ళీ వర్షాలు పడుతుండటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో సక్రమంగా ధాన్యం కొనుగోలు జరగటం లేదని, ధాన్యాన్ని భద్రపరచుకొనేందుకు తమకు వసతులు లేవని రైతులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

తూర్పుగోదావరి జిల్లా, పెరవలి మండలం, తీపర్రు గ్రామానికి చెందిన నందమూరి జానకి రాముడు కు చెందిన పాస్‌పోర్ట్ నెంబర్ **F9750553,** తీసుకుని జిరాక్స్ నిమిత్తం సెంటర్‌కు వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్:
నందమూరి జానకి రాముడు
S/o. సత్యనారాయణ, డో.నెం. 1-80,
తీపర్రు గ్రామం, పెరవలి మండలం
తూర్పుగోదావరి జిల్లా
పిన్-534331, సెల్: 9866228173

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

నగదును అందిస్తున్న లైన్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేటలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సాత్విక్ అనే విద్యార్థికి ఉన్నత విద్య కోసం లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ రూ.17 వేలు ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు ఎంవిఎస్ ఎల్.ప్రసూన మాట్లాడుతూ దానాల్లో కల్లా విద్యా దానం గొప్పదనే భావంతో తమ క్లబ్ సభ్యులు ఆర్థిక సాయం అందించారని అన్నారు. టిసి.దేవకీదేవి, శ్రీవిద్య, నాగిరెడ్డి లక్ష్మి ఒక్కొక్కరు రూ.5 వేలు చొప్పున, టి.శంకరి రూ.2 వేలు అందించారని ప్రసూన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

టిడిపి కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ పిల్లి సత్యనారాయణమూర్తి అందజేశారు. తూరంగి పంచాయతీలోని పగడాల పేట గ్రామానికి చెందిన మల్లాడి రాజు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. టిడిపి సభ్యత్వం కల్గిన అతని కుటుంబానికి టిడిపి కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా మంజూరైన రూ.5 లక్షల మెగా చెక్కును గురువారం బాధిత కుటుంబానికి వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం తీసుకుంటే ఆ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మిరపల ప్రకాష్, నాయకులు గరికిన పెద్దరాజు, జాన్ ప్రసాద్, మోసా రమేష్, బాబ్జీ, చక్కా సత్తిబాబు, ప్రసాద్, సత్తిబాబు పాల్గొన్నారు.

పదవ తరగతి మార్క్‌లిస్ట్ పోయినది

చాగల్లు మండలం, కలవలపల్లి గ్రామ కాపురస్తురాలు, **నల్లూరి జయశ్రీ తండ్రి: హనుమంతరావు** అను నాయొక్క **పదవ తరగతి ఒరిజినల్ మార్క్స్ లిస్ట్ ది.03-05-2025వ తేదీన మార్క్‌లిస్ట్‌ను జిరాక్స్ తీయించుకొని వెళుచుండగా నిడదవోలు దారి మార్గంలో పడిపోయినది.** కావున ఎవరికైనా దొరికినచో నాకు **అందజేయగలరు.**

నల్లూరి జయశ్రీ తండ్రి: హనుమంతరావు
ఫోన్: 8142227387